


బుధవారం కామారెడ్డి జిల్లా దోమకొండ మండల బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో సీఎం కేసీఆర్ నామినేషన్ కోసం రూ.50 వేల నగదును మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌కు విరాళంగా అందజేస్తున్న కోనాపూర్ గ్రామస్తులు

బుధవారం కామారెడ్డి జిల్లా భిక్కనూర్‌లో జరిగిన సమావేశానికి పెద్ద ఎత్తున హాజరైన బీఆర్ఎస్ పార్టీ మహిళా కార్యకర్తలు



# ఒక్కాయనను ఎదుర్కొనేందుకు 16 మందా?

**సీఎంలను, కేంద్ర మంత్రులను, ప్రధానిని బీజేపీ తెచ్చుకుంటున్నది**

**తెలంగాణ రాష్ట్రానికి మోదీ చేసిందేమిటి.. జరిగిన మేలేది?**

**భిక్కనూర్, దోమకొండ బీఆర్ఎస్ సమావేశాల్లో మంత్రి కేటీఆర్**

**ఢిల్లీ పెత్తనాన్ని గట్టిగా తిప్పికొట్టాలని ప్రజలకు పిలుపు**

**రైఫిల్ రెడ్డి డిపాజిట్ గల్లంతు చేయాలని ఓటర్లకు సూచన**

**నామినేషన్ ఖర్చులకు రూ.50 వేలు ఇచ్చిన కోనాపూర్ ప్రజలు**

నిజామాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కామారెడ్డిలో ఒక్కాయనను ఎదుర్కొనేందుకు ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, మోదీ, అమిత్ షా సహా 16 మందిని బీజేపీ తెచ్చుకుంటున్నదని మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణకు మోదీ చేసినది ఏంటో చెప్పాలని, ఆయన వల్ల రాష్ట్రానికి జరిగిన మేలేంటని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న కామారెడ్డి నియోజకవర్గంలో కేటీఆర్ వరుసగా రెండోరోజూ పర్యటించారు. బుధవారం ఉమ్మడి భిక్కనూర్, దోమకొండ మండలాల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో వేర్వేరుగా సమావేశమైన ఆయన తన ప్రసంగంతో శ్రేణుల్లో ఉత్తేజం నింపారు. కామారెడ్డికి వచ్చి కేసీఆర్ ముందు తొడకొట్టుడు అంటే పోచమ్మ ముందు పొట్టేలును కట్టేసినట్టేనని పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి హెచ్చరించారు. ఉద్యమంలో ఉద్యమకారులపై తుపాకీ ఎక్కుపెట్టిన రైఫిల్‌రెడ్డి ఇక్కడికొచ్చి పోటీ చేస్తాడట అని ఎద్దేవా చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ఢిల్లీ దొరలకు.. తెలంగాణ ప్రజలకు మధ్య జరుగుతున్న పోరు అని అభివర్ణించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో సోనియాను బలిదేవతగా అభివర్ణించిన రేవంత్‌రెడ్డికి ఇప్పుడు ఆమె కాళికామాతలా కనిపిస్తున్నదా? అని ప్రశ్నించారు. సుద్ద పప్పు అంటూ సంబోధించిన రాహుల్‌గాంధీ ఇప్పుడు తెలివిమంతుడిలా కనిపిస్తున్నాడా? అని నిలదీశారు. వచ్చే ఎన్నికల్లో కామారెడ్డి నుంచి కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు డిపాజిట్ రాకుండా చేయాలని పిలుపునిచ్చారు. వచ్చే ప్రభుత్వంలో దోమకొండను మున్సిపాలిటీ చేస్తామని హామీ ఇవ్వగా అదే వేదికపై కేసీఆర్‌కు ఎన్నికల ఖర్చు నిమిత్తం కోనాపూర్ గ్రామస్థులు రూ.50వేల నగదును అందించారు.

### ఒక వ్యక్తి వల్లే కామారెడ్డికి కేసీఆర్

కామారెడ్డి నుంచి పోటీ చేస్తున్నట్టు కేసీఆర్ ప్రకటించినప్పటి నుంచీ రాష్ట్రమంతా ఒకటే



మంత్రి కేటీఆర్ ప్రసంగానికి చప్పట్లు కొడుతూ మద్దతు తెలుపుతున్న వృద్ధురాలు

చర్చ జరుగుతున్నదని కేటీఆర్ పేర్కొన్నారు. ''కామారెడ్డికి కేసీఆర్ రావడానికి గంప గోవర్ధనే కారణం. 'అన్నా..కామారెడ్డి రైతుల చిరకాల కోరిక ఒక్కటే. మా పొలాలకు గోదావరి నీళ్లు రావాలె. జల్దీగా నీళ్లు రావాలంటే మీరు రావాలి' అని గోవర్ధన్ చెప్పడంతో రెండో ఆలోచన లేకుండా కేసీఆర్ ఒప్పుకున్నారు. కామారెడ్డి లో 9న నామినేషన్ దాఖలు చేయబోతున్నారు. ఆ రోజు భిక్కనూర్, రాజంపేట మండలాల నుంచి ఇంటికొకరు చొప్పున సభకు తరలి రావాలి.. అదిచూసి అవతలి పార్టీలో నామినేషన్ విత్ డ్రా చేసుకునేలా మీరంతా రావాలి'' అని మంత్రి కేటీఆర్ కోరారు.

### అలా చెప్పినాయనకు తలకాయ ఉందా?

జంగంపల్లి నుంచి కామారెడ్డి దాకా కేసీఆర్ భూములు ఏసుకుంటా పోతాడని బీజేపోడు చెబుతున్నాడని, వానికి తలకాయ ఉందా? నెత్తిలో మెదడు ఉందా? అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ''గంత పెద్ద మనిషి.. రెండుసార్లు ముఖ్యమంత్రి అయిన వ్యక్తి కామారెడ్డి భూముల కోసం వస్తాడా? ఆయన ఎందుకొస్తున్నడు. మీకు తాగునీరు, సాగునీరు ఇచ్చేందుకు, పరిశ్రమలు తెచ్చేందుకు వస్తుండు. మాకేం అవసరం ఉంది మీ భూములతో. చెప్పుకునే దమ్ము లేక బీజేపోడు ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతుండు. మోదీ వచ్చి తొమ్మిదేండ్లు అవుతున్నది. బీజేపోడ్ని అడగండి. 70 రూపాయల పెట్రోల్‌ను 110 రూపాయలు చేసిండు. 400 రూపాయలున్న సిలిండర్ ధరను రూ. 1200 చేసింది మోదీ కాదా? చేసుకున్నది చెప్పుకునే దమ్మీలేని దద్దమ్మలు వారు. అసైన్డ్ భూములకు సంపూర్ణ హక్కులను సంబంధీకులకే ఇస్తాం. మీ భూములను గుంజుకునే అవసరం ప్రభుత్వానికి ఏమున్నది'' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గంపన్న చేతిలోనే ఓడిన షబ్బీర్ అలీ.. కేసీఆర్ చేతిలో ఎలా గెలుస్తామని నిజామాబాద్ వెళ్లినట్టు ఉన్నాడని అన్నారు. బీజేపీ వాళ్లు సైతం ఇదే ఆలోచనలో ఉన్నారని పేర్కొన్నారు.

### 55 ఏండ్లలో కాంగ్రెస్ ఏం చేసింది?

షబ్బీర్ అలీ గమ్మత్తుగా మాట్లాడుతున్నారని, రోడ్లు ఇట్లెందుకు ఉన్నాయి.. మోర్లు ఇలా ఎందుకున్నాయని అంటున్నారని, కాంగ్రెస్‌కు 11 సార్లు చాన్స్ ఇస్తే ఇయ్యాల పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్నారని మంత్రి కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను బిచ్చగాళ్లు అంటున్న రేవంత్‌రెడ్డికి గుణపాఠం చెప్పాలని కోరారు. రైతుబంధుతో కేసీఆర్ డబ్బులను దుబారా చేస్తున్నాడని కాంగ్రెసోళ్లు చేస్తున్న ఈ ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అయ్యాక మరిన్ని కొత్త పథకాలు వస్తాయని, కాంగ్రెస్, బీజేపీ దొంగలకు అవకాశం ఇవ్వొద్దని పిలుపునిచ్చారు. ఆయా సమావేశాల్లో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ తిరుమల్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, నేతలు ఎల్ నర్సింగరావు, వకీల్ రామారావు, ఎంజీ వేణుగోపాల్‌గౌడ్, నల్లవెల్లి అశోక్, గంప శశాంక్ పాల్గొన్నారు.



### మంత్రి కేటీఆర్ వాహనం తనిఖీ


*మనోహరాబాద్, నవంబర్ 1: హైదరాబాద్ నుంచి కామారెడ్డి వెళ్తున్న మంత్రి కేటీఆర్ వాహనాన్ని మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద పోలీసులు, ఎన్నికల సిబ్బంది ఆపి తనిఖీ చేశారు. వాహన తనిఖీకి కేటీఆర్ పూర్తిగా సహకరించారు. తనిఖీ పూర్తయ్యే వరకు కారు దిగి వేచి చూశారు. అనంతరం కామారెడ్డి బయల్దేరారు.*




# ఢిల్లీ దొరలకు.. తెలంగాణ ప్రజలకు మధ్య పోటీ

- **తెలంగాణ తల దించదు.. తల వంచదు**
- **రాహుల్! కాళేశ్వరం వెళ్లు.. చూడు.. నేర్చుకో**
- **బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్**
- **బీఆర్ఎస్‌లో చేరిన గొట్టిముక్కల వెంగళ్‌రావు**

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ సవాల్‌ను స్వీకరిస్తున్నామని, తెలంగాణ ఎన్నికలు ఢిల్లీ దొరలకు, తెలంగాణ ప్రజలకు మధ్య జరుగుతున్న పోటీయేనని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఢిల్లీ అహంకారానికి, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల పౌరుషానికి ప్రతీకగా ఉన్న కేసీఆర్‌కు మధ్య జరుగుతున్న పోటీలో ధర్మమే గెలుస్తుందని, న్యాయమే నిలుస్తుందని అన్నారు. తెలంగాణను అన్ని రంగాల్లో బాగుచేసిన కేసీఆర్ గెలవాలా? 55 ఏండ్లు తెర్లుతెర్లు చేసిన కాంగ్రెస్, తొమ్మిదిన్నరేండ్లలో నయా పైసా పనిచేయని బీజేపీ గెలవాల్నా నిర్ణయించాల్సింది తెలంగాణ ప్రజలేనని అన్నారు. తెలంగాణ ఏనాడు తల దించదు.. తల వంచదని తేల్చి చెప్పారు. బుధవారం తెలంగాణ భవన్‌లో కూకట్‌పల్లి కాంగ్రెస్ నేత గొట్టిముక్కల వెంగళ్‌రావు, పీసీసీ డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు జీ విశ్వతేజరావు, రాజమల్లయ్య, చున్నూబాయ్, పుష్పరాజ్, యాకయ్య, కంచిస్వామి, దినేశ్, వెంకట్, కిట్టు, మల్లేశ్‌గౌడ్, గురుమూర్తి, గణేశ్, మహ్మద్ షమీ, మహ్మద్ షరీఫ్, అస్లామ్, ప్రవీణ్‌గౌడ్, మహేశ్‌గౌడ్, అరుణ్, రేష్మ, సంధ్య, కల్పన, కృష్ణవేణి సహా 1000 మంది కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కుర్మయ్యగారి నవీన్‌కుమార్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుల సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. ఎమర్జెన్సీ విధించిన ఇందిరమ్మ మనువడు రాహుల్‌గాంధీ ప్రజాస్వామ్యం గురించి సుద్దులు చెప్తున్నారని ఎద్దేవా చేశారు. ఓటుకు నోటు దొంగ రేవంత్‌ని పక్కకు పెట్టుకొని అవినీతి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం వెళ్లు.. చూడు.. నేర్చుకో అని రాహుల్‌కు సూచించారు. కుల మత భేదాలు లేకుండా ప్రజాసేవ చేసే పార్టీ బీఆర్ఎస్ ఒక్కటేనని, అలాంటి పార్టీని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని మంత్రి అన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో మహిళలకు అనేక పథకాలు అమలు చేయబోతున్నారని తెలిపారు. హిందు-ముస్లిం, ఆంధ్ర-తెలంగాణ తగాదాలు ఒక్కటీ తెలంగాణలో లేవని పేర్కొన్నారు. కేసీఆర్ వంద రూపాయల నోటు లాంటివారైతే, కాంగ్రెస్ చిల్లర బిల్లలాంటిదని విమర్శించారు. గొట్టిముక్కల వెంగళ్‌రావు మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డిపై దుమ్మెత్తిపోశారు. 50-60సీట్లను కాంగ్రెస్ నాయకులు అమ్ముకున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ ఎం నవీన్‌రావు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణభవన్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న కూకట్‌పల్లి కాంగ్రెస్ నేత గొట్టిముక్కల వెంగళ్‌రావు, పీసీసీ డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు జీ విశ్వతేజరావు



మంచిర్యాలలో మాట్లాడుతున్న విప్ సుమన్. చిత్రంలో ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, మాజీ ఎమ్మెల్యే అరవింద్‌రెడ్డి

## కాంగ్రెస్ హింసా రాజకీయాలపై చర్యలు తీసుకోండి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్యేల వినతి**

నస్పూర్, నవంబర్ 1: ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి చేయించిన కాంగ్రెస్‌పై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య కోరారు. బుధవారం మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో కలెక్టర్ బదావత్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అంటేనే కల్లోలం అని మండిపడ్డారు. ఉమ్మడి ఏపీలోని కాంగ్రెస్ పాలనలో ఫ్యాక్షన్ రాజకీయాలు, హత్య రాజకీయాలు, హింసా రాజకీయాలు చేశారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ అభ్యర్థులకు రక్షణ కల్పించాలని కలెక్టర్‌కు విన్నవించినట్టు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాజీ ఎమ్మెల్యే అరవింద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## కత్తిపోట్ల నిందితుడికి రిమాండ్

- **కాంగ్రెస్ కార్యకర్తను కోర్టులో హాజరుపరిచిన పోలీసులు**
- **ఎవరు ప్రోత్సహించారన్న దానిపై పోలీసుల ఆరా**
- **సిద్దిపేట కమిషనర్ శ్వేత వెల్లడి**

సిద్దిపేట అర్బన్, నవంబర్ 1: మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నం చేసిన నిందితుడిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్టు సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత తెలిపారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో బుధవారం సీపీ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎంపీపై మిరుదొడ్డి మండలం పెద్దచెప్యాలకు చెందిన గటాని రాజు (40) కత్తితో పొడిచి హత్యాయత్నం చేశాడని చెప్పారు. ఈ మేరకు దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. నిందితుడు గటాని రాజు విలేకరి అని చెప్పుకుంటూ ప్రజల వద్ద డబ్బులు వసూలు చేస్తూ జల్సాలు చేసే వాడని.. కానీ, అతనిపై ఎక్కడా కేసు నమోదు కాలేదని చెప్పారు. ఎంపీని చంపాలనే ఉద్దేశం



తోనే దుబ్బాక మార్కెట్‌లో కత్తి కొనుగోలు చేసి హత్యకు యత్నించాడని తెలిపారు. ఘటన జరిగిన ప్రదేశంలోనే నిందితుడిని ప్రజలు కొట్టారని.. దీంతో అతడిని అదుపులోకి తీసుకొని గాంధీ దవాఖానకు తరలించి చికిత్స చేయించామని చెప్పారు. దవాఖాన నుంచి డిశ్చార్జ్ అయిన నిందితుడు రాజును తొగుట సీఐ కమలాకర్ బుధవారం అదుపులోకి తీసుకొని విచారించగా.. 'సంచలనమైన సంఘటనకు పాల్పడటం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించేందుకు హత్యాయత్నం చేశాను' అని నేరాన్ని ఒప్పుకున్నట్టు సీపీ తెలిపారు. నిందితుడు నేరం చేయడానికి ఇతర కారణాలు ఉన్నాయా? ఎవరైనా ప్రోత్సహించారా.. అన్న అంశాలపై ప్రత్యేక బృందాల ద్వారా విచారణ కొనసాగుతున్నదని చెప్పారు. రాజును కోర్టులో హాజరుపరచగా, అతడికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారని, అతడిని చర్లపల్లి జైలుకు తరలించామని తెలిపారు.